వైభవంగా కొండచుట్టు మహోత్సవం


కొండచుట్టు మహోత్సవానికి బయల్దేరిన శ్రీమూలస్థాన ఎల్లమ్మ


జనసంద్రంగా మారిన చంద్రగిరి వీధులు

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే

చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మతల్లి సంక్రాంతి మహోత్సవాల్లో భాగంగా గురువారం కొండచుట్టు మహోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. టీటీడీ తరపున చంద్రగిరి శ్రీ కోదండ రామస్వామి ఆలయం నుంచి సారెను ఊరేగింపుగా తీసుకుని వచ్చి అమ్మవారికి సమర్పించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులతో పాటు టీటీడీ తిరుమల ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం అమ్మవారి సారెను ఊరేగింపుగా తీసుకువచ్చారు. పలుచోట్ల భక్తులు పూల దండలు, హారతులతో సారెకు సాదర స్వాగతం పలికారు.

వైభవంగా కొండ చుట్టు

సాయంత్రం శ్రీమూలస్థాన ఎల్లమ్మకు ప్రత్యేక పూజలను నిర్వహించి కొండచుట్టు మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం అమ్మవారు ధర్మరాజుల ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు అందుకున్నారు. అక్కడ నుంచి ద్రౌపది, ధర్మరాజుల సమేత భీమ, అర్జునులతో కొండ చుట్టుకు పయనమయ్యారు. మండలంలోని అగరాల గ్రామానికి రాత్రి 10గంటల సమయంలో అమ్మవారు తన అక్క అయిన ఆరిమేణి గంగమ్మ చెంత కొలువుదీరారు. అనంతరం పుట్టింటి సారెను స్వీకరించారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుంచి అమ్మవారు ఐతేపల్లె, పుల్లిత్తివారిపల్లె, నాగయ్యగారిపల్లె, రామిరెడ్డిపల్లె, రెడ్డివారిపల్లె మీదుగా శుక్రవారం ఉదయం అమ్మవారు కొండచుట్టు మహోత్సవం ముగించుకుని చంద్రగిరికి చేరుకోనున్నారు. రాత్రంతా ఎక్కడా విశ్రాంతి లేకుండా అమ్మవారు ఊరేగుతూ గ్రామాల్లోని ప్రజల నుంచి ప్రత్యేక పూజలను అందుకుంటూ ముందుకు సాగారు. అమ్మవారు గ్రామాలలో ఊరేగడం ద్వారా మండలంలోని ప్రజలు ఈతి బాధలు, రుగ్మతలు తొలగి సుఖసంతోషాలతో జీవిస్తారని భక్తుల నమ్మకం.

అలరించిన కళా ప్రదర్శనలు

అమ్మవారి కొండ చుట్టు ఉత్సవాలకు పలువురు కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తులను అలరించారు. అమ్మవారి వేషధారణలతో పాటు ఆంజనేయుడు, కాళీమాత వేషాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే కేరళ వాయిద్యాలు, డప్పు కళాకారుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కొండ చుట్టు ఉత్సవంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి


చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికు స్వాగతం పలుకుతున్న గ్రామ పెద్దలు

చంద్రగిరి: చంద్రగిరి శ్రీ మూలస్థాన ఎల్లమ్మతల్లి సంక్రాంతి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన కొండ చుట్టు మహోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. చంద్రగిరిలోని ద్రౌపదీ సమేత ధర్మరాజులు, మిట్టమీద గంగమ్మ, అంకాలమ్మ, వేశాలమ్మ, నడివీధి గంగమ్మలతో పాటు గ్రామ దేవతలు అంతా కలసి ఊరేగింపుగా బయలుదేరే కొండ చుట్టుకు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి హాజరయ్యారు. స్థానిక ధర్మరాజుల గుడి వద్ద ఆయనకు గ్రామ పెద్దలు సాదర స్వాగతం పలికి స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అనంతరం ఊరేగింపుకు సిద్ధంగా ఉన్న దేవతా మూర్తులను దర్శించుకున్నారు.కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.


కేరళ కళాకారుల ప్రదర్శన


వివిధ వేషధారణలో భక్తులు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి


మాట్లాడుతున్న డీఎం వెంకటరమణ

సత్యవేడు : రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఆర్టీసీ డీఎం వెంకటరమణ అన్నారు. గురువారం ఆర్టీసీ గ్యారేజ్ ఆవరణలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఆర్టీసీ మనుగడ ఉద్యోగులపై ఆధారపడి ఉందన్నారు. బస్సులు నడపడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. నష్టాలను అధిగమించేందుకు ప్రణాళిక, కేటాయించిన వేళల్లో బస్సులు తిప్పాలన్నారు. రహదారిపై ప్రయాణించేటప్పుడు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని కోరారు. డ్రైవర్లు పూర్తిగా విశ్రాంతి తీసుకొని డ్యూటీకి హాజరు కావాలన్నారు. మానవ తప్పిదాలతోనే 90 శాతం ప్రమాదాలకు దారితీస్తున్నట్లు ఓ అధ్యయనంలో తేలిందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వర్మ, ఏఎస్ఐ బాలసుబ్రహ్మణ్యం, డిపో ఎన్ఎంయూ సెక్రటరీ బాబు, ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ మధుబాబు, పవన్‌కుమార్, శేఖర్, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి : పట్టణంలోని ఆర్టీసీ డిపో గ్యారేజీలో గురువారం ఘనంగా రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ఉండాలన్నారు. మద్యపానం చేసి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎఫ్ చక్రవర్తి, అసిస్టెంట్ మేనేజరు చిట్టెమ్మ, యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కుంభాభిషేకం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా గిరి ప్రదక్షిణ మార్గంలోని శ్రీఅన్నపూర్ణ సమేత హరహరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల లోపు ఈ పూజలు జరుగుతాయన్నారు.

ఎనిమిదవ వేతన సంఘం ఏర్పాటుపై హర్షం

తిరుపతి సిటీ: ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ ప్రకటనను స్వాగతిస్తున్నట్లు అఖిల భారతీయ రాష్ట్రీయ శిక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పదేళ్లకోకసారి పే కమిషన్ ఏర్పాటు చేసే సంప్రదాయాన్ని సమర్థిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమని తెలిపారు. ఈ నిర్ణయం ఉద్యోగ విరమణ చేసిన, పనిచేస్తున్న ఉపాధ్యాయులతో పాటు మొత్తం ఉద్యోగ సమాజానికి ఉపశమనం కలిగించే అంశమని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం, ఇతర ఆర్థిక కారకాలను పరిగణనలోకి తీసుకుని ఉపాధ్యాయులు, ఉద్యోగుల విస్తృత ప్రయోజనాలకు అనుగుణంగా ఎనిమిదో వేతన సంఘం సిఫారసులను సమర్పిస్తుందని పేర్కొన్నారు.

పొట్టేలు నరికిన వ్యక్తులపై కేసు

తిరుపతి క్రైం: ఇటీవల విడుదలైన హీరో బాలకృష్ణ డాకు మహారాజా మూవీ సందర్భంగా బాలకృష్ణ ఫ్లెక్సీ ముందు పొట్టేలు నరికిన వ్యక్తులపై ఈస్ట్ పోలీసులు కేసు నమోదు. జంతు హింస చేయడం దారుణమని దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు.. శంకర్, రమేష్, సురేష్, ప్రసాద్, లోకేష్ బాబుపై కేసు నమోదు చేశారు.

కేశవాయనగుంటలో చోరీ

నగరంలోని కేశవాయన గుంటలో చోరీ జరిగిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల వరకు.. కేశవాయన గుంట 6వ క్రాస్‌లో నివాసముంటున్న విజయలక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి ఇటీవల పండుగలకు ఊరు వెళ్లారు. ఇదే అవకాశంగా దొంగలు పడ్డారు. దుండగులు తలుపులు పగులగొట్టి ఇంట్లో ఉన్న 40 గ్రాముల బంగారు, 200 గ్రాములు వెండిని దోచుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఈస్ట్ పోలీసులు తెలిపారు.

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

శ్రీకాళహస్తి : ప్రభుత్వాలు వృద్ధుల సంక్షేమానికి కృషి చేయాలని ఏక్తా యాంటీ కరప్షన్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ కోరారు. ఏక్తా యాంటీ కరప్షన్ జాతీయ సహాయ కార్యదర్శి అబ్దుల్ రెహ్మాన్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద వృద్ధులు, సాధువులకు దుప్పట్లు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. చలికాలంలో ఎంతో మంది సాధువులు, వృద్ధులు వంతెన మీద నిద్రిస్తూ చలికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ వంత సాయంగా వీరికి కులమతాలకు అతీతంగా దుప్పట్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో యాసిన్, అబ్దుల్ కలాం, అన్వర్ పాల్గొన్నారు.

వేడుకగా గోవిందుడి పార్వేట ఉత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో గురువారం స్వామి వారి పార్వేట ఉత్సవం వేడుకగా నిర్వహించారు. ప్రతి ఏటా సంక్రాంతి తర్వాత కనుమ పండుగ నాడు ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. గురువారం సాయంత్రం 4 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి, శ్రీఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులు ఆలయం నుంచి రేణిగుంట రోడ్డులోని పార్వేట మండపానికి ఊరేగింపుగా వేంచేపు చేశారు. అక్కడ స్వామివారి ఆస్థానం నిర్వహించారు. పార్వేట మండపానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరై స్వామి పార్వేటను తిలకించారు. అనంతరం తిరిగి నగర వీధుల్లో ఊరేగింపుగా ఉత్సవ మూర్తులను సాయంత్రం 6 గంటలకు ఆలయానికి వేంచేపు చేశారు. కార్యక్రమంలో టీటీడీ స్థానిక ఆలయాల డెప్యూటీ ఈఓ శాంతి, ఆలయ అర్చకులు, ఇతర అధికార ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.


పార్వేట ఉత్సవం నిర్వహిస్తున్న అర్చక స్వాములు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తిరుపతి మున్సిపాలిటీ పలు పర్యాయాలు అవార్డులు అందుకుంది. పారిశుధ్యంలో తిరుపతి కూడా బెస్ట్ అంటూ ఆహా..ఓహో అని అధికారగణం డప్పులు కొట్టుకుంది. కానీ ఇక్కడ చిత్రంలోని నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికుడిని చూస్తే మాత్రం అయ్యో అనిపించకమానదు. మోకాలి వరకు బిర్రుగా లాగిన ప్యాంటు, మోచేతి వరకు మడిచిన ఫుల్ హ్యాండ్స్ షర్ట్...చొక్కా, ప్యాంటుకు కంపు కొట్టే కాలువ మట్టి మరకలు..చేతులకు గ్లౌవ్స్ లేవు. మోకాలి బూట్లు లేవు. ముక్కుకు మాస్కూ లేదు. చేతులకు ప్లాస్టిక్ కవర్లు చుట్టుకుని మురుగు కాలువలో కంపును భరిస్తూ, చెత్తను చేతులతో ఎత్తుతున్న అతడి జీవన చిత్రం * చూస్తే ఎవరికైనా చివుక్కుమనిపించకమానదు. గురువారం తిరుపతిలోని ఓ ప్రాంతంలో ఇలా తదేకంగా విధులు నిర్వరిస్తూ కంటబడడంతో సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ఏపాటి ప్రాధాన్యత ఇస్తోందో ఈ చిత్రం చెప్పకనే చెబుతోంది. -సాక్షి ఫోటోగ్రాఫర్, తిరుపతి



జనసంద్రంగా మారిన దోర్నకంబాల



పరుగులు తీస్తున్న కోడెగిత్తలు



జోరుగా జల్లికట్టు

- పట్టీల కోసం యువకుల పాట్లు
- ఎడ్ల ధాటికి పరుగులు తీసిన జనం

చంద్రగిరి: మండలంలోని దోర్నకంబాల, మల్లయ్యపల్లెలో గురువారం పశువుల పందేరాలు(జల్లికట్టు) క్రీడను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. పశువుల యజమానులు ఎడ్ల కొమ్ములకు రంగులు వేసి, నడుముకు నల్లదారం కట్టి, వాటి కొమ్ములకు పలకలను కట్టి క్రీడకు సిద్ధం చేశారు. ఒక్కసారిగా పరుగులు తీసిన ఎడ్లను నిలువరించేందుకు యువకులు నువ్వా, నేనా? అనే లెవెల్లో పోటీపడ్డారు. కొన్ని ఎడ్లు జనం మధ్య దూసుకెళ్లడంతో ఎక్కడ పొడుస్తాయోననే భయంతో పరుగులు తీశారు. ఈ పరుగుల నడుమే యువకులు ఎడ్లను నిలువరించి, వాటి కొమ్ములకు ఉన్న పలకలను సొంతం చేసుకున్నారు. విజయగర్వంతో చిందులేశారు. అయితే కొన్ని చోట్ల పలకల కోసం యువకులు బాహాబాహీకి దిగారు.

ప్రత్యేక ఆకర్షణగా దళపతి జగన్

తిరుపతి మంగళం: సంక్రాంతి పండుగ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గం మల్లయ్యపల్లెలో గురువారం నిర్వహించిన జల్లికట్టులో వైఎస్సార్ అభిమాని, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మగుంట రవి ఆధ్వర్యంలో ఎద్దులకు దళపతి జగన్ ఫొటోతో కట్టిన ప్రభలు అందరినీ ఆకర్షించాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత పెద్ద ఎత్తున జగనన్న ఫొటోలను చేతపట్టి జై జగన్ అంటూ నినదించారు.


జల్లికట్టులో ఎద్దుకు కట్టిన దళపతి జగన్ ఫొటోతో ఉన్న ప్రభలు